మాజీ ఎమ్మెల్యే కొమ్మూరికి మాతృవియోగం

సత్తెమ్మ(ఫైల్)

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 13: మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తల్లి కొమ్మూరి సత్తెమ్మ (87) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని పలువురు నాయకులు పరామర్శించారు. సత్తెమ్మ అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో ముగిశాయి. అంత్యక్రియల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట అర్బన్, మార్చి 13: ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. మరోవైపు ఫీజుల పేరుతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిధులు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్ భాను, రంజిత్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న సీఎం

చేర్యాల: మాట్లాడుతున్న యాదయ్య

హుస్నాబాద్‌లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేర్యాల, మార్చి 13 : ప్రభుత్వం భర్తీ చేయనున్న గ్రూపు 1, గ్రూపు 2, గ్రూపు 3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలను ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షలు ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాదయ్య, మండల ఇన్‌చార్జి ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, శ్రీనివాస్, మధుకర్, నర్సింహులు, గణేశ్, శ్రీనివాస్, సంతోశ్, కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్ టౌన్, మార్చి 13: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీలోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించడం సరికాదని, నాలుగు గ్రూపులుగా విభజించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణను సమగ్రంగా చేపట్ట కుండా గ్రూపు 1,2,3 నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కొలుగూరి అశోక్, నాయకులు ఎనగందుల లక్ష్మీనారాయణ, గాదపాక రవీందర్, బోయిని రాజశేఖర్, శంకర్, గణేశ్, రాజు, వినోద్ ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నంగునూరు, మార్చి 13: మండల పరిధిలోని అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలలో గురువారం ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, పిరమిడ్ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జానయ్య మాట్లాడుతూ.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలు విద్యార్థుల భావోద్వేగాలను, బంధాలను బలోపేతం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 ర్యాంకర్‌కు అభినందన

మణికంఠను సన్మానిస్తున్న హుస్నాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, మార్చి 13: గ్రూప్-2లో 103వ ర్యాంకు సాధించిన హుస్నాబాద్‌కు చెందిన అయిలేని మణికంఠను గురువారం పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా మణికంఠ గ్రూప్స్-1లో విజయం సాధించాలని, ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేవారు మణికంఠను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ కౌన్సిలర్లు బోజు రమాదేవి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆయూబ్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు

హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవితకు పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న అనంతుల ప్రశాంత్, జాగృతి నాయకులు

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

గజ్వేల్, మార్చి 13: ఎమ్మెల్సీ కవిత పుట్టిన రోజు వేడుకలను గజ్వేల్‌లో పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. గ్రీన్ ఛాలెంజ్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో కేక్‌కట్ చేశారు. అనంతనం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ..నిత్యం పేదల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడుతున్న కవిత ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ అభ్యున్నతికి మరింత కృషిచేసేలా భగవంతుడు మరింత బలాన్ని చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ నాయకులు కాటు కల్యాణ్, ఎల్లా వెంకట్, కార్తీక్, మహేశ్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో..

కోహెడ, మార్చి 13: మండల కేంద్రంలో గురువారం కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలను సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం స్థానిక ప్రైవేటు దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముంజ కనకయ్య, మాధవి తదితరులున్నారు.


కోహెడ: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రాజు

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 13: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుట్ల కవితను గురువారం భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల ప్రశాంత్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

గందరగోళంగా ఎల్ ఆర్ ఎస్

మాట్లాడుతున్న జంగం రాజలింగం

సిద్దిపేట టౌన్, మార్చి 13: కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ గందరగోళాన్ని సృష్టిస్తున్నదని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం రాజలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎల్ఆర్ఎస్‌పై అధికారులకు కనీస అవగాహన లేదని మండిపడ్డారు. అవసరాల కోసం యజమానులు పాట్లు అమ్ముకుందామనుకుంటే ఎల్ఆర్ఎస్‌తో పెద్దచిక్కు వచ్చిపడిందన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో అవగాహనతో ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నేతలు భగవాన్‌రెడ్డి, వంగ మల్లారెడ్డి, రాగుల శ్రీకాంత్, కరుణాకర్‌రెడ్డి, మధు, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మిరుదొడ్డి క్రీడాకారులు

మద్దెల ప్రణయ్

అందె చేతన్

వేముల యువతేజ

మిరుదొడ్డి, మార్చి 13: జాతీయ స్థాయి యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మిరుదొడ్డికి చెందిన అందె చేతన్, వేముల యువతేజ, మద్దెల ప్రణయ్ ఎంపికైనట్లు ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మిరుదొడ్డి మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య గురువారం తెలిపారు. క్రీడా కారులు ఈనెల 5,6 తేదీల్లో జరిగిన యునివర్సిటీ ఎంపికలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో ఉస్మానియా, జేఎన్‌టీయూ యూనివర్సిటీ జట్లకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 14 నుంచి 17 వరకు కర్ణాటకలోని బెంగళూరు నార్త్ యూనివర్సిటీలో జరిగే జాతీయ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడలకు మన క్రీడాకారులు

ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు

గజ్వేల్, మార్చి 13: ఈనెల 14 నుంచి 16 వరకు వనపర్తిలోని డాక్టర్ బాలకిష్టయ్య ప్రాంగణంలో నిర్వహించనున్న తెలంగాణ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 ఫుట్‌బాల్ క్రీడలకు ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల జట్లు తరలివెళ్లాయి. గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ నుంచి నిశ్చిత, అక్షిత్, పవన్, మారుతి, మహాత్మా జ్యోతిరావుపూలే వర్గల్ గురుకులం నుంచి నితిశ, వసంత, మనుశ్రీ, లహరికలతో పాటు కోచ్ రాంగారి నర్సింహులుతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంగారి గణేశ్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో ఎదగడానికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

జగదేవ్‌పూర్, మార్చి 13: కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ముసిగడపలో చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం గ్రామానికి చెందిన నర్రా బాలేశ్ కుతూరు ప్రవళిక(14) కొద్ది రోజులుగా కడుపునొప్పి వస్తుండడంతో డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడింది. గురువారం ఉదయం కడుపునొప్పి వస్తుందని తండ్రికి చెప్పగా దవాఖానకు వెళ్దామని చెప్పి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తర్వాత తల్లి వచ్చి చూసి గజ్వేల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

విజ్ఞానయాత్రకు 'మోడల్ స్కూల్' విద్యార్థులు

మద్దూరు నుంచి విజ్ఞాన యాత్రకు వెళ్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 13: మద్దూరులోని మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం యాదాద్రి-భువనగిరి జిల్లాకు విజ్ఞాన యాత్రకు వెళ్లారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'పీఎంశ్రీ' పథకంలో భాగంగా విద్యార్థులను ఐదు బస్సుల్లో యాదాద్రి-భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలోని 'వన్‌డే కిషన్' కార్యక్రమానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పురాతన కాలం నాటి వ్యవసాయ పద్ధతులు, పల్లెటూరు జీవన విధానం, నాటి పనిముట్ల వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజ్ఞానయాత్రల వల్ల విద్యార్థులకు జ్ఞానంతోపాటు వినోదం కలుగుతుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేశ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

నాగపురిలో పంటలు పరిశీలిస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకుల బృందం

చేర్యాల, మార్చి 13: ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సత్తిరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌మావో డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం బృందంతో పాటు సీపీఎం పార్టీ ప్రతినిధుల బృందం గురువారం మండలంలోని నాగపురి, తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జున్ పట్ల గ్రామాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులకు ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపి ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపితే కరువు పరిస్థితులు వచ్చేవికావన్నారు. అధికారులు వెంటనే సర్వే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అరుణ్‌కుమార్, తిరుపతి, ఎల్లయ్య, చంద్రారెడ్డి, రాజు, నాయకులు తేలు ఇస్తారి, దేవేందర్‌రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఉపసర్పంచ్ మృతి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 13: మద్దూరు మాజీ ఉపసర్పంచ్ మహ్మద్ జుల్ఫాకర్ అహ్మద్(57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. 2013-18 వరకు ఉపసర్పంచ్‌గా జుల్ఫాకర్ గ్రామానికి సేవలందించారు. జుల్ఫాకర్‌అహ్మద్ మృతిపై పలువురు నాయకులు సంతాపాన్ని తెలియజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వర్గల్, మార్చి13: వర్గల్‌లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జడ్పీటీసీ సుధారాణీప్రభుదాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాధాప్రవీణ్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

డిగ్రీ కళాశాలకు వాటర్‌కూలర్ అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చేర్యాల, మార్చి 13: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపక బృందం కోసం రూ.35వేల విలువ గల వాటర్‌కూలర్‌ను గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు దీపాంజలి, ప్రతినిధులు బాల్‌నర్సయ్య, కొండయ్య, ధర్మరాజు, మహేశ్వరి, ప్రిన్సిపాల్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

వర్గల్, మార్చి 13: మండలంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం హంసా దవాఖాన సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కిడ్నీ, మూత్ర సమస్యలు, సాధారణ జబ్బులతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆహార నియమాలు, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

చేర్యాల, మార్చి 13: మండలంలోని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, కంబాక్సులు, డిక్షనరీలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు లింగయ్య, వి.రమేశ్, కృష్ణమూర్తి, రామకృష్ణ, కాంతికృష్ణ, మమత, సాజిదా, అరుణ, ప్రీతి, సీఆర్పీ రవీందర్, దినేశ్, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మధు

గజ్వేల్, మార్చి 13: మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంలో సింగాటం గ్రామానికి చెందిన తలారి సత్తయ్యకు వచ్చిన రూ. 43,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెండే మధు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కిష్టారెడ్డి, పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రామ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

జగదేవపూర్ మార్చి 13: జగదేవపూర్ ఎంపీడీవోగా రామ్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో యాదగిరి నల్లగొండకు బదిలీపై వెళ్లారు. నల్లగొండ జిల్లా చండూరు మండలంలో పనిచేసిన రామ్‌రెడ్డి జగదేవపూర్‌కు వచ్చారు. బదిలీపై వచ్చిన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు శాలువాకప్పి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శైలజ, యాదగిరి, నితిన్, ఎల్లం, లక్ష్మి, కృష్ణ, నర్సింహులు, ఈజీఎస్ సిబ్బంది నాగరాజు ఉన్నారు.

16న దుబ్బాకలో జాబ్‌మేళా

దుబ్బాక, మార్చి 13: దుబ్బాక నియోజకవర్గంలో నిరుద్యోగ మహిళలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దుబ్బాక బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. 10వ తరగతి ఆపైన చదువుకున్న 18 ఏండ్లు నిండిన యువతులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

ఘనంగా మొల్ల జయంతి

దుబ్బాకలో శాలివాహన సంఘంలో మొల్ల జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

దుబ్బాక, మార్చి 13: శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం దుబ్బాకలో మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు రాములు, కోశాధికారి శంకర్, సభ్యులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 13: కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో రైతు రాసుల యాదన్‌రావు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గ్రామానికి చెందిన శివాజీ యూత్ అండగా నిలిచింది. గురువారం మృతుడి అంత్యక్రియలకు శివాజీ యూత్ సభ్యులు రూ.20 వేలు, గ్రామానికి చెందిన రాసుల అనిల్‌కుమార్ రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అండగా నిలిచిన యువకులకు మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నారాయణరావుపేట, మార్చి 13: మండలపరిధిలోని బంజేరుపల్లిలో గురువారం డీఆర్డీవో జయదేవ్ ఆర్యా ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

స్వామివారి సన్నిధిలో భక్తుల భజనలు

సిద్దిపేట టౌన్, మార్చి 13: సిద్దిపేట పాత వేంకటేశ్వరాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సంగీత విభావరి, భక్తి పాటలు, భజనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఏకాంత సేవ నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సహజ సిద్ధమైన రంగులతో హోలీ వేడుకలు

హుస్నాబాద్: డిగ్రీ కళాశాలలో సహజ సిద్ధమైన రంగులు తయారుచేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట టౌన్: హోలీ వేడుకల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

మద్దూరు(ధూళిమిట్ట): రేబర్తిలో సేకరించిన మోదుగపూలతో మహిళలు

హుస్నాబాద్ టౌన్, మార్చి 13: సహజ సిద్ధమైన రంగులతో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా గురువారం హోలీ వేడుకలను జరుపుకొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళశాలలో బీట్‌రూట్, బంతిపూలు, మోదుగ పూలు, పాలకూరలతో రంగులను తయారు చేశారు. సహజ సిద్ధమైన రంగులను మాత్రమే హోలీ వేడుకల్లో ఉపయోగిస్తామని, ఇతరులకు సైతం అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణాన్ని కాపాడేందుకు సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించి శరీరానికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా కాపాడుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి సూచించారు. ఈ సందర్భంగా హోలీ రంగులను తయారు చేసిన అధ్యాపకులను, విద్యార్థులను ఆయన అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సిద్దిపేట టౌన్, మార్చి 13: ప్రకృతి ప్రసాదించిన సహజ సిద్ధ రంగులతోనే హోలీ జరుపుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. కళాశాల వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం సహజ సిద్ధ రంగులతో హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రకృతి సిద్ధ రంగులు వాడటం వల్ల వాతావరణ సమతుల్యతను కాపాడిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయోధ్యరెడ్డి, మధుసూదన్, జగదీశ్వరా చారి, శైలజ, ప్రవంతి, మిరాజ్ ఫాతిమా, రోహిణి, మదన్మోహన్, ఉమామహేశ్వరి, లీలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో..

మిరుదొడ్డి, మార్చి 13 : ఉమ్మడి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు హోలీ పండుగను ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సహజ రంగులతో హోలీ సంబురాలు జరుపుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 13: హోలీ పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవా